క్లుప్తంగా

నత్తనడకన 'డబుల్ ఇళ్ల' సర్వే

నెల రోజులవుతున్నా 10 శాతం పూర్తి

హఫీజ్‌పేట్ : డబుల్ ఇళ్ల తుది జాబితాకు అధికారులు దరఖాస్తుల సర్వే చేపట్టారు. 15 రోజుల్లో సర్వే పూర్తి చేసి తుది జాబితా అందించాలని అధికారులు కోరగా చందానగర్ సర్కిల్ పరిధిలో 8,389 దరఖాస్తులకు శుక్రవారం వరకు 10 శాతం మాత్రమే పూర్తి చేశారు. గత నెల 28వ తేదీ నుంచి దరఖాస్తుల సర్వే ప్రారంభించగా నెల రోజులవుతున్నా నత్తనడకన సర్వే నడుస్తుంది.

ఆరంభ అపార్టుమెంట్ సామర్థ్య పరీక్షలు

శేరిలింగంపల్లి: జెఎన్‌టీయూ టెక్నికల్ అధికారులు గచ్చిబౌలి డివిజన్ డాక్టర్స్ కాలనీ సుభీ నిర్మాణ సంస్థ సెల్లార్ పక్కనే ఉన్న పీఎన్ ఆరంభ అపార్టుమెంట్ల సామర్థ్య పరీక్షలను శుక్రవారం చేశారు. సెల్లార్ ప్రక్కనే పీఎన్ అపార్టుమెంట్ ప్రహరీ, పార్కింగ్ ఫ్లోరింగ్ దెబ్బతినడంతో అపార్టుమెంట్‌వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

బాధ్యతలు తీసుకున్న అమీన్‌పూర్ ఎస్‌ఐలు

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి సీసీఎస్‌లో ఉన్న ఎస్‌ఐలు ఈవీ రమణ, మల్లయ్యలు శుక్రవారం అమీన్‌పూర్ ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ సుభాష్ ఇటీవలే హత్నూరకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రాంరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలంలు పరామర్శించారు.

నల్లగండ్ల చెరువును పరిశీలించిన అధికారులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల చెరువును ఇరిగేషన్ శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. డీఈ నీలిమ, ఏఈ నాగరాజులు చెరువుకట్ట పటిష్టత, అలుగును పరిశీలించి వర్షాలు కురిస్తే వెంటనే చెరువు నీటిని కిందకు వదిలేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

చేనేత హస్తకళా ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఆగస్టు 6 తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఫెస్టివల్‌లో ప్రత్యేక డిజైన్‌తో కూడిన బ్లాక్ ప్రింట్, చేనేత చందేరి, మహేశ్వరీ, కోసా, డ్రెస్ మెటీరియల్స్, పెయింటింగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలి

రాయదుర్గం: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ మంజూర్‌హుస్సేన్ సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, బేసిక్స్‌పై ఎక్కువ చర్చ సాగుతోందన్నారు. అందరూ వీటి వినియోగం ద్వారా ఎంతో ప్రగతిని సాధిస్తున్నారన్నారు. ప్రతి ఉద్యోగి, అధికారి ఇలాంటి సాంకేతికపరిజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఇలాంటి అంశాలపై శిక్షణ ఇవ్వడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆధ్వర్యంలో ఏటా 300కు పైగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎస్కీ ఆధ్వర్యంలో ప్రస్తుతం ట్రెండ్‌కు అనుగుణంగా ప్రత్యేక కోర్సులను కూడా ఇక్కడ నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో టెక్ మహీంద్రా హెడ్ బ్లాక్ చెయిన్ డెవలపర్ సాయిప్రశాంత్, డీఎస్‌టీ ప్రోగ్రామ్స్ నోడల్ ఆఫీసర్ సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి

వానొస్తే..ఆగాల్సిందే..

- అండర్ బ్రిడ్జిల విస్తరణ జరిగేదెప్పుడో...?
- అసంపూర్తిగా లింక్ రోడ్ల పనులు
- ఐటీ ఉద్యోగులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

హఫీజ్‌పేట్ : అండర్ బ్రిడ్జిలతో అవస్థలు తప్పడం లేదు. ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యం. ఉదయం, సాయంత్రం వేలాది వాహనాలు రోడ్డుపై బారులుదీరుతున్నాయి. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక వర్షాకాలం వస్తే అంతే సంగతులు. ప్రజలు రాకపోకలు సాగించే అండర్ బ్రిడ్జిల కిందకు భారీగా వరద నీరు చేరడంతో పూర్తిగా మూసివేస్తున్నారు.

- ఓల్డ్ హఫీజ్‌పేట్, నల్లగండ్ల ఫ్లైఓవర్‌పై ఇసుక వేస్తే రాలనంత ట్రాఫిక్‌తో వాహనదారులకు నరకం కనబడుతోంది.
- ట్రాఫిక్ దృష్టిలో పెట్టుకొని లింకు రోడ్డు నిర్మాణం చేపట్టినా అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి.
- చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి వైపు వెళ్లాలంటే ప్రధానంగా రెండు డివిజన్లలో అండర్ బ్రిడ్జిలున్నాయి.

వరద.. మళ్లీ రాకపోకలు బంద్

శేరిలింగంపల్లి: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం కూడా వరద కొనసాగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో బారికేడ్లు ఏర్పాటు చేసి పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు.

- మియాపూర్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల ఐటీ ఉద్యోగులు లింగంపల్లి, పాపిరెడ్డి కాలనీ, వైశాలీనగర్‌లలో అండర్ బ్రిడ్జి మీదుగా వెళతారు.
- కానీ అండర్ బ్రిడ్జిలు ఇరుకుగా ఉండడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ కష్టాలు అన్నీఇన్నీకావు.
- శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్‌ఎం మాల్ వరకు లింక్ రోడ్డు నిర్మించాలని పనులు ప్రారంభించారు. అది అసంపూర్తిగా ఉన్నాయి.
- కేంద్రం నుంచి రైల్వే అండర్ పాస్, ఫ్లైఓవర్లకు నిర్మాణ అనుమతులు రావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం అనుమతుల కొరకు విన్నవించినా అవి ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం పరిస్థితి

- గచ్చిబౌలి, రాయదుర్గంలోని ఐటీ కంపెనీలకు రావాలంటే ముఖ్యంగా ఈ అండర్ బ్రిడ్జి నుంచి రావాల్సిందే. ఇప్పుడు వర్షాకాలం ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలకు అండర్ బ్రిడ్జి కిందకు వరద నీరు చేరడంతో బ్రిడ్జిలు మూసివేశారు.
- దశాబ్ద కాలం నుంచి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులతో పాటు రోడ్లు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడిక్కడ లింకు రోడ్లు అంటూ నిర్మిస్తున్నారు.
- చందానగర్, హఫీజ్‌పేట్ పరిధిలోని మూడు అండర్ బ్రిడ్జిలు, ఒక ఫ్లైఓవర్ విస్తరణ నిర్మాణ పనులు ఎప్పటికి జరిగేనో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

సమస్యలు...

- వైశాలీనగర్, పాపిరెడ్డికాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్లు ఇరుకుగా ఉన్నాయి.
- బ్రిడ్జిల కింద ఒకవైపు రోడ్డు, మరో వైపు మురుగు నీటి కాలువ నిర్మించారు. వర్షాకాలం రోడ్ల మూసివేతకు ఇదే ప్రధాన కారణం.
- ఇరుకు రోడ్లలోనే నాలాల ఏర్పాటుతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వర్షాలు వస్తే అండర్ పాస్‌ల రోడ్లు గుంతలుగా మారుతున్నాయి.
- అసంపూర్తిగా లింకు రోడ్డు పనులు జరగడంతో వాహనాలు అండర్ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది.
- మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మూడు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. దానిలో రెండు రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్లు ఉండగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు సరిపోవడం లేదు. ఉన్న మూడు అండర్ పాస్‌లు ఇరుకుగా ఉన్నాయి.

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. త్వరలోనే ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళిక సిద్ధం చేసి రెండు నెలల్లోనే పనులు ప్రారంభిస్తాం. చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌ను ప్రణాళికతో విస్తరణ చేయడానికి అధికారులను ఆదేశించాం.

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్‌లో భారీగా వరద నీరు చేరడంతో బారికేడ్‌తో బ్రిడ్జిని మూసివేసిన దృశ్యం



శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి జీఎస్‌ఎం మాల్ వరకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయి ఐశ్వర్య లేఅవుట్, ఖాజాగూడ, గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్, హెచ్‌ఎండీఏ, హెజీసీఎల్, ఎస్‌ఏఎస్ ఇన్‌ఫ్రా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎనిమిది మందికి కొవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



గురు గోవింద్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, జెడీసీ మమత తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని గురు గోవింద్‌సింగ్ నగర్ కాలనీని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి జెడీసీ మమత పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీకాంత్, మాన్‌సూన్ సిబ్బందితో కలిసి ముంపు ప్రాంతంలో పర్యటించారు. అక్కడ చేపట్టిన సహాయక పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఏఐ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, యాదగిరి, సంగమేష్, పోశెట్టి గౌడ్, వాసుదేవరావు, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యను పరిష్కరించండి

కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీలో ప్రధాన ఎస్టీపీ పైప్‌లైన్ పగిలిపోవడంపై నెలకొన్న సమస్యను జలమండలి అధికారులతో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ పరిశీలనలో జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు నరేందర్, యశ్వంత్, సందీప్‌రెడ్డి, సౌజన్య, రాజేశ్వరి, కాలనీవాసులు ఉన్నారు.



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

వీవీ ప్యాడ్స్‌పై అవగాహన

హఫీజ్‌పేట్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు వీవీ ప్యాడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఈవీఎంలతో వీవీ ప్యాడ్స్‌ను అందుబాటులో ఉంచారు. ఓటర్లు ఎవరికి ఓటు వేస్తున్నారో వీవీ ప్యాడ్స్ నుంచి వచ్చే స్లిప్ ద్వారా తెలుసుకోవడం కోసం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలోని కాలనీలలో, బస్తీలలో, షాపింగ్ మాల్స్‌లో ఈ వీవీ ప్యాడ్స్‌పై అవగాహన కల్పించనున్నారని అధికారులు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు ప్రజలకు వీవీ ప్యాడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శివరాంప్రసాద్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో వీవీ ప్యాడ్స్‌పై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్ చిత్రమయి స్టేట్ఆర్ట్ గ్యాలరీలో చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఉస్మానియా యూనివర్శిటీ బోటని హెచ్‌ఓడి డాక్టర్ బి.రమాదేవి, తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండి డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణపై వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయన్నారు. వరల్డ్ నేచర్ కన్సర్వేషన్ డేను పురస్కరించుకుని అవగాహన ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చిత్ర కళాకారిణి మాళిక జొన్నల వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో 26 చిత్రాలున్నాయని ఈ ప్రదర్శన ఆగస్టు 1వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



ఇలా ఉంటే ఎలా..

- అండర్‌బ్రిడ్జి పరిస్థితి గురించి ప్రశ్నించిన విజయశాంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద 15 ఏళ్ళుగా పరిస్థితి ఇలా కొనసాగుతుంటే అభివృద్ధి చేశామని చెబితే ఎలా ?అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. శేరిలింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పరిస్థితిని ఆమె శుక్రవారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్న వర్షం పడితే రాకపోకలు ఆపివేయడంతోనే ఏటా గడుపుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే వాహనాల రాకపోకలు నిలిపివేస్తే, ఇక మనుషుల సంగతి ఏమిటని ఆమె ప్రశ్నించారు.15 ఏళ్ళుగా ఈ సమస్యను పరిష్కరించక పోవడం వారి పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. చిన్న వర్షం పడితే రోడ్లపైకి నీరు, ట్రాఫిక్ జామ్ కావడం, రోడ్లు దాటలేని పరిస్థితులు అంతటా నెలకొనడం నగరంలో పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గజ్జెల యోగానంద్ మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులకు పట్టాలు పంపిణీ

మియాపూర్ : నిరుపేదలకు అండగా ఉంది ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. జీఓ నంబర్ 58, 59 ద్వారా పేదలకు యాజమాన్య హక్కులు ఇవ్వనున్న క్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో కొండాపూర్,గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్ , హఫీజ్‌పేట, చందానగర్, భారతీనగర్ డివిజన్ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 15 మంది లబ్ధిదారులకు డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌తో కలిసి ఎమ్మెల్యే పట్టాలను అందజేశారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సలీం, చందానగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నరేందర్ బల్లా, సందీప్‌రెడ్డి, యశ్వంత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటం సిగ్గుచేటు



సిక్కుల కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరదాల నరేష్, నాయకులు

బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సిక్కుల బస్తీలో వరదనీట మునిగిన ఇళ్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరదాల నరేష్, పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పేద ప్రజల ఇళ్లు, బస్తీలు మునిగిపోతున్నా ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు సాయం చేయకుండా ప్రకృతి వైపరీత్యం అని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్ పట్టించుకోకపోవడం తగదన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం వరదలు వచ్చినప్పుడు వరదను మూసీ కాలువలోకి మళ్లించి సిక్కుల కాలనీ ముంపు బారిన పడకుండా చూస్తామని చెప్పారని ఆ దిశగా చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని, అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, రవీందర్‌రావు, జానకి రామరాజు, కమలాకర్‌రెడ్డి, కుమార్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం..



మాదాపూర్‌లో రెయిన్‌కోట్‌లతో స్కూటర్‌పై ప్రయాణం



గచ్చిబౌలి ప్రాంతంలో ..

గొడుగులు, రెయిన్‌కోట్లకు డిమాండ్

గచ్చిబౌలి/మాదాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 'గొడుగు' లేనిదే బయటకు 'అడుగు' వేయలేని స్థితి నెలకొంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో వర్షం పడుతూనే ఉండడంతో జనం గొడుగులు, రెయిన్‌కోట్లు కొంటున్నారు. అక్టోబర్ వరకు వర్షాలు పడే అవకాశం ఉండడంతో గొడుగులు, ఇతర సామగ్రిని విక్రయించే దుకాణాలు, సూపర్ మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.



మాదాపూర్‌లో గొడుగులు కొంటున్న ప్రజలు



మాదాపూర్‌లో గొడుగుతో వెలుతున్న వృద్ధుడు



కూరగాయలు కొంటున్న మహిళ



పారిశుద్ధ్య పనుల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది